క్లుప్తంగా

వన్ డే టూర్ ప్రత్యేక బస్సు


బస్సును ప్రారంభిస్తున్న డిపో మేనేజరు పవన్

గజ్వేల్‌రూరల్: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి ఒకరోజు ప్రత్యేక బస్సు బయలు దేరిందని మేనేజర్ పవన్ తెలిపారు. స్పెషల్ టూర్ ప్యాకేజీలో భాగంగా ఈ బస్సు శనివారం ప్రజ్ఞాపూర్ నుంచి ప్రారంభమైన గజ్వేల్ మీదుగా నాచారం లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, వర్గల్ విద్యాధరి సరస్వతి దేవాలయం, కొండ పోచమ్మ దేవాలయం నుంచి ఆనంద నిలయం సమీపంలోగల అష్టలక్ష్మీ దేవాలయం అనంతరం సిద్దిపేటలోని కోమటిచెరువు వరకు కొనసాగినట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో ఉన్న దేవాలయాలకు సైతం ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులు నడిపించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

ఉచిత వైద్య శిబిరం


కరపత్రం ఆవిష్కరిస్తున్న పరమేశ్వర్

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే పురస్కరించుకుని జూలై 1 పట్టణ కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ అసోసియేషన్ అధ్యక్షుడు రామగళ్ల పరమేశ్వర్ తెలిపారు. శిబిరానికి సంబంధించిన కరపత్రాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరంలో పోలీసులు, జర్నలిస్టులు, మున్సిపల్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు గుండె సంబంధిత వైద్య పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రఘునందన్ రాణా, సంతోష్ కుమార్, దయానంద్, శ్రీవాత్సవ, శివ, ప్రణీత్, అనంతకుమార్ పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు: ఏఓ


విత్తనాలు అందజేస్తున్న కృష్ణ, ఏఓ సంతోష్

బెజ్జంకి(సిద్దిపేట): రైతులు కేవలం వరి, పత్తి పంటలనే కాకుండా ఆరుతడి, చిరుధాన్యాలను సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ సూచించారు. జాతీయ ఆహార భద్రత మిషన్ ద్వారా మంజూరైన కంది విత్తనాలను రైతువేదికలో శనివారం రైతులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ కంది సాగు విస్తీర్ణత పెంచేందుకు ప్రభుత్వం ఉచితంగా ఎల్ఆర్‌జీ-2 రకం విత్తనాలు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ ఏర్పాటుకు వినతి


వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు సహకరించాలని గ్రామస్తులు శనివారం శాసనమండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్‌కు హైదరబాద్‌లో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం గ్రామంలో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. భూ కేటాయింపు జరగకపోవడంతో అది జరగలేదని వాపోయారు. భూమి కేటాయించాలని కోరారు. సమస్యను పరిష్కరిస్తామని ప్రకాశ్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. సాయిలు, రాజు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

తీరొక్క వంటల ప్రదర్శన


ఆహార పదార్థాలను తిలకిస్తున్న హెచ్ఎం

దుబ్బాకరూరల్: రామేశ్వరంపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు తీరొక్క వంటలు చేసి ప్రదర్శించారు. పులిహోర, భక్ష్యములు, అరిసెలు, బాలామృతం, ఇడ్లి, డబల్కామీటా, గులాబ్‌జామ్, ఫ్రూట్ సలాడ్, మిర్చి, ఆలు బజ్జీలు, లడ్డూలు లాంటి ఆహార పదార్థాలు తయారు చేశారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌రెడ్డి శనివారం వాటిని తిలకించారు. ఆహారపు అలవాట్ల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, జాన్‌కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ శ్యామల, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఇస్మాయిల్, రాజేశం, శ్రీనివాస్, అమృత్, నర్మద, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

సేకరణ శూన్యం.. పరిస్థితి దైన్యం

తడి, పొడి చెత్త నిర్వహణలో నిర్లక్ష్యం
- నిరుపయోగంగా కంపోస్ట్ షెడ్లు
- ఎక్కడంటే.. అక్కడే చెత్త కుప్పలు
- ప్రచారానికే పరిమితమైన అధికారులు
- ఇబ్బందుల్లో వివిధ గ్రామాల ప్రజలు


బస్వాపూర్‌లో నిరుపయోగంగా ఉన్న డంపింగ్ యార్డులు

చెత్త బండి వచ్చిందమ్మా.. తడి–పొడి చెత్తను వేరువేరుగా వేయండమ్మా అంటూ పంచాయతీ వాహనం మైక్‌లో చెవులు ఊదరగొట్టేలా చేసిన ప్రకటన కేవలం ప్రచారానికే పరిమితమైంది. చెత్త ద్వారా కంపోస్ట్ ఎరువు తయారు చేయాలని, తద్వారా పంచాయతీలకు ఆదాయ వనరులు కల్పించాలని గత ప్రభుత్వం సంకల్పించింది. అందుకు ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులు, కంపోస్ట్ షెడ్లు, ప్రత్యేక వాహనాలు ప్రచారానికే పరిమితమయ్యాయి.

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని బస్వాపూర్‌లో పంచాయతీ సిబ్బంది చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. రోడ్డు పక్కనే చెత్తను డంపుచేస్తున్నారు. మండలవ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. చెత్త సేకరణపై అధికారులకు పట్టింపు లేకపోవడంతో లక్ష్యం నీరుగారుతోంది.

కానరాని చిత్తశుద్ధి

విడివిడిగా తడి, పొడి చెత్తను సేకరించేందుకు ప్రభుత్వం ఇంటింటికీ రెండు బుట్టలు అందించింది. చెత్తను వేరువేసి సేకరించాలని పంచాయతీ సిబ్బందికి ప్రభుత్వం సూచించింది. కానీ ప్రస్తుతం గ్రామాల్లో ఫలితం శూన్యం. మండలంలో 27 గ్రామాల్లో 27 డంపింగ్ యార్డులు, కంపోస్ట్ షెడ్లు నిర్మించారు. కాని ఇప్పటి వరకు మండలం


శివారులో పారబోసిన చెత్త

లో రెండు, మూడు గ్రామాల్లో తప్ప తడి, పొడి చెత్తను వేరుచేసిన దాఖలాలు లేవు.

చెత్తకు నిప్పు

మండల వ్యాప్తంగా 27 గ్రామాల్లో పంచాయతీకి ఒకటి చొప్పున డంపింగ్ యార్డులకు ఆనుకొని చెత్త ఎరివేత షెడ్లు నిర్మించారు. ఒక్కో షెడ్డుకు కలిపి రూ.2.50లు ప్రభుత్వం కేటాయించింది. కానీ డంపింగ్ యార్డులో తడి, పొడిచెత్తను వేరుగా వేయాల్సిన సిబ్బంది రెండింటినీ కలిపి శివారులోకి తరలించి నిప్పు పెడుతున్నారు. దీంతో లక్షలు వెచ్చించి నిర్మించిన షెడ్లు నిరుపయోగంగా మారాయి. అలాగే

వినియోగంలోకి తేవాలి



గ్రామాల్లో లక్షలు ఖర్చుచేసి నిర్మించిన డంపింగు యార్డులను వినియోగంలోకి తేవాలి. సేకరించిన చెత్తను తడి, పొడిచెత్తగా వేరుచేసి డంపింగ్ చేయాలి. చెత్తకు నిప్పు పెట్టడంతో పొగతో ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలి.

– గాదాసు భాస్కర్, బస్వాపూర్

చెత్తకు నిప్పు పెట్టడంతో వెలువడుతున్న రసాయనాలు వాయు కాలుష్యాన్ని కలగజేస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారబోయకుండా డంపింగ్ యార్డు లేదా కంపోస్ట్ షెడ్డుకు తరలించేలా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నాలుగు నెలలుగా అందని వేతనాలు

సీఐటీయూ జిల్లా నేత భాస్కర్


సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్

దుబ్బాక: పంచాయతీ కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకుండా అధికారులు ఇబ్బందులపాలు చేస్తున్నారని, పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్ డిమాండ్ చేశారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో పంచాయతీ కార్మికులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సరానికి రెండ జతల దుస్తులు, హ్యాండ్ గ్లౌజులు అందించాలని, అలాగే ఆరోగ్య పరీక్షలు చేయించాలని కాని ఇవేవీ పట్టించుకోకుండా అధికారులు వివక్ష చూపుతున్నారన్నారు. పంచాయతీ కార్మికుల మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయకుండా పని భారాన్ని పెంచుతుందని విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, జులై 9న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెలో పంచాయతీ కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్మికుల నూతన మండల కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా ప్రశాంత్, కార్యదర్శిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా పురుషోత్తం, రాకేశ్ తదితరులు ఎంపికయ్యారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం


విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

ములుగు(గజ్వేల్): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలు చేపడుతుందని పూర్వ జిల్లా గవర్నర్ వడ్లమాని రవి అన్నారు. మండలంలోని సింగన్నగూడ ఉన్నత పాఠశాలలోని వంద మంది పేద విద్యార్థులకు రోటరీ క్లబ్, హెల్ప్ టు నీడీ సంస్థల ఆధ్వర్యంలో శనివారం సైకిళ్లు పంపిణీ చేశారు. ముఖ్యతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నవంబరు 14న చిల్డ్రన్ డే సందర్భంగా మరో వెయ్యి మందికి సైకిళ్లు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. అనంతరం హెల్ప్ టు నీడీ సంస్థ అధ్యక్షుడు మహేశ్‌రావు మాట్లాడుతూ సింగన్నగూడ పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఉదయ్‌బాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అంజిరెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సాయిరెడ్డి, రాజ్యలక్ష్మి, హన్మంతరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, బాబుగౌడ్, జగదీశ్వర్, చంటి, బాలకృష్ణ, స్వామిగౌడ్, బాపురెడ్డి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం


చిన్నకోడూరు(సిద్దిపేట): మల్లారంలో పనులు ప్రారంభించిన షాబొద్దీన్, మహేందర్ తదితరులు


దుబ్బాకటౌన్: టింకంపేటలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

డీసీసీ ప్రధాన కార్యదర్శి షాబొద్దీన్

చిన్నకోడూరు(సిద్దిపేట): కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల సొంతింటి కల సాకారమవుతోందని డీసీసీ ప్రధాన కార్యదర్శి షాబొద్దీన్, ఆ పార్టీ మండల అధ్యక్షుడు మీసం మహేందర్ అన్నారు. మండల పరిధిలోని కస్తూరిపల్లి, మల్లారం, మేడిపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు శనివారం ముగ్గులు పోశారు. లబ్ధిదారులతో కలిసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతోందని, అర్హులందరికీ అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మి, రాజు, పరశురాములు, రాజేశ్, భూపతిరెడ్డి, వినోద్, గణేశ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు

దుబ్బాకటౌన్/దౌల్తాబాద్(దుబ్బాక)/సిద్దిపేట జోన్: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. రాయపోల్ మండల పరిధిలోని గొల్లపల్లి, ఉదయపూర్, టింకంపేట, రాంసాగర్ తదితర గ్రామాల్లోను, దౌల్తాబాద్ మండల కేంద్రంలోను ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆత్మ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, సుధాకర్, భాస్కర్‌రెడ్డి, కనకయ్య, మల్లేశం, కృష్ణగౌడ్, యాదగిరి, కిష్టారెడ్డి, రవి, ప్రశాంత్, వెంకటరెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సిద్దిపేట 43వ వార్డులో ఏఈ దివ్య, వార్డు అధికారి స్వర్ణలత, మున్సిపల్ కౌన్సిలర్ పూర్ణిమ, ఎల్లం తదితరులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు.

మాటకు కట్టుబడిన ప్రభుత్వం

సిద్దిపేటరూరల్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీకి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. రూరల్, నారాయణరావుపేట మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఆయన ముగ్గుపోసి పనులు ప్రారంభించారు. లబ్ధిదారులు తొందరగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు యాదగిరి, డీసీసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌వీర్, ఫిషరీస్ రాష్ట్ర కార్యదర్శి బాబేష్, నాయకులు రాములు, అంజిరెడ్డి రామచంద్రం పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని మోయతుమ్మెద వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ మధుసూదన్ తెలిపారు. వాగు నుంచి ఇసుకను తరలిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు శనివారం దాడిచేసి వారిని పట్టుకుని మద్దూరు పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవన్నారు.

మొక్కలే ఆధారం

కొండపాక(గజ్వేల్): మానవ మనుగడకు మొక్కలే ఆధారమని విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు కిశోర్, మాజీ సర్పంచ్ కిరణ్‌కుమార్‌చారి అన్నారు. మంగోల్ గ్రామంలో శనివారం వివిధ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు దోహదపడుతాయన్నారు. ఇంటి పరిసరాలు, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని కోరారు. నాయకులు కనకయ్య, వీరేశం, సాయిబాబా, మహేందర్, వెంకటేశం, కరుణాకర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్, భిక్షపతి, సంతోష్, కరుణాకర్ పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. వెళ్లేది ఎలా?


బురదమయంగా మారిన రోడ్డు

మండలంలోని చేర్వాపూర్ నుంచి చేర్వాపూర్‌కు వెళ్లే దారి పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ప్రయాణం నరక ప్రాయంగా మారింది. గుంతల్లో వర్షపు నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోడ్డు ధర్మాజీపేట చౌరస్తా వద్ద సిద్దిపేట–రామాయంపేట జాతీయ రహదారికి కలుస్తుంది. వర్షం కురిస్తే పరిస్థితి మరీ దారుణంగా ఉంటుందని,మరమ్మతులు చేపట్టాలని ఆ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

– దుబ్బాకరూరల్

ఆరోగ్యంతోనే ఏదైనా సాధ్యం

అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్


పరేడ్‌ను పరిశీలిస్తున్న సుభాష్ చంద్రబోస్

చిన్నకోడూరు(సిద్దిపేట): సంపూర్ణ ఆరోగ్యంతోనే ఏదైనా సాధించవచ్చని అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్ అన్నారు. మండల పరిధిలోని పెద్దకోడూరు శివారులోని సీఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో జిల్లాలోని సివిల్, రిజర్వ్ పోలీస్, హోంగార్డు సిబ్బందికి శనివారం పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది క్రమం తప్పకుండా వాకింగ్, రన్నింగ్, యోగా వంటివి చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. వ్యాయామాన్ని నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని, ఎలాంటి అనారోగ్యానికి గురికాకుండా విధులు నిర్వహించడానికి అవకాశం ఉందన్నారు. చెడు వ్యసనాలకు అలవాట్లకు పడి విధులలో నిర్లక్ష్యం వహిస్తే పోలీస్‌శాఖ ప్రతిష్ఠకు భంగం కలిగించే వారవుతారన్నారు. కార్యక్రమంలో ఏసీపీ రవీందర్‌రెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌లు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అపరిచితులతో అప్రమత్తం

ట్రాఫిక్ సీఐ మురళి


గజ్వేల్‌రూరల్: అవగాహన కల్పిస్తున్న సీఐ మురళి

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని ట్రాఫిక్ సీఐ మురళి పిలుపునిచ్చారు. కమ్యూనిటీ పోలిసింగ్‌లో భాగంగా శనివారం బాలికల ఎడ్యుకేషన్ హబ్ ఆవరణలోని కేజీబీవీలో విద్యార్థినులకు సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, గుడ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు చదువుల్లో రాణించి తాము ఎంచుకున్న లక్ష్యం దిశగా ముందుకు సాగాలన్నారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ అనురాధ, ఉపాధ్యాయులు, షీ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

కొండపాక(గజ్వేల్): మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ సూచించారు. స్థానిక హైస్కూల్లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ప్రభుత్వం షీటీంలు ఏర్పాటు చేసిందని, ఏ సమస్య వచ్చినా విద్యార్థినులు ధైర్యంగా ముదుకు వచ్చి వాటిని వినియోగించుకోవాలన్నారు. హెచ్ఎం సముద్రాల శ్రీనివాస్, ఉపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు బానిస కావొద్దు


మద్దూరు(హుస్నాబాద్): మాట్లాడుతున్న ఎస్ఐ షేక్ మహబూబ్

మద్దూరు(హుస్నాబాద్): చదవుకునే సమయంలో విద్యార్థులు చెడు అలవాట్లుకు బానిసలు కావొద్దని ఎస్ఐ షేక్ మహబూబ్ అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు చట్టాలు, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. హుస్నాబాద్ షీ టీమ్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బూరుగుపల్లిలో..

సిద్దిపేటఅర్బన్: గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని రూరల్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ పరమేశ్వరి అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని బూరుగుపల్లిలో పోలీసు కళాబృందం కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్తు పదార్థాలు విక్రయించినా, వినియోగించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, వ్యాపారస్తులు సహకరించాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

◆ **ప్రాధాన్యం కల్పిస్తాం**

వర్గల్(గజ్వేల్): స్థానిక సంస్థల ఎన్నికలలో యువజన కాంగ్రెస్ నాయకులకు ప్రాధాన్యం కల్పిస్తామని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి అన్నారు. వర్గల్ మండలం మల్లారెడ్డిపల్లిలో శనివారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు, శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. రాష్ట్ర నేత ఖలీద్ అహ్మద్, రాష్ట్ర నాయకులు శ్యామ్‌సుందర్‌రెడ్డి, మాజిద్‌ఖాన్, సాయికుమార్, రింకురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **ప్రజావాణి నిర్వహించరూ!**

చేర్యాల(సిద్దిపేట): తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహించాలని కోరుతూ తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తుల భాస్కర్‌రెడ్డి తహసీల్దార్ దిలీప్‌నాయక్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. గతంలో మాదిరిగా ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహించాలని, మండల స్థాయి అధికారులు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. శ్రీనివాస్‌రెడ్డి, బాబు, ఖాన్, ఎల్లయ్య, మల్లయ్య, పోచయ్య పాల్గొన్నారు.

◆ **అర్హులందరికీ ఇళ్లు కేటాయించాలి**

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. బెజ్జంకిలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 4,200 మంది దరఖాస్తు చేసుకుంటే 492 మందికి మాత్రమే కేటాయించారని వాపోయారు. లక్ష్మణ్, శ్రీనివాస్‌రావు, సంజీవరెడ్డి, ఐలయ్య, మహేందర్‌రెడ్డి, రాజిరెడ్డి, శేఖర్‌బాబు, దేవయ్య, మోహన్ పాల్గొన్నారు.

◆ **మౌలిక సదుపాయల కల్పనకు కృషి**

దుబ్బాకటౌన్: ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయల కల్పనకు కృషి చేస్తామని లయన్స్ క్లబ్ స్నేహ గజ్వేల్ అధ్యక్షుడు మల్లేశంగౌడ్ చెప్పారు. శనివారం రాయపోల్ మండలం ఆరేపల్లి ప్రాథమిక పాఠశాలలో రూ.8 వేల విలువగల మైక్ సెట్‌ను అందజేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు. హెచ్ఎం చంద్రశేఖర్, సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయండి**

సిద్దిపేటకమాన్: ఐదువేల కోట్లతో రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని జిల్లా రెడ్డి జేఏసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌రెడ్డి కోరారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలన్నారు. రాంలింగారెడ్డి, దేవేందర్‌రెడ్డి, దుర్గారెడ్డి, రాచంద్రరెడ్డి, గాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **బాధిత కుటుంబాలకు పరామర్శ**

తొగుట(దుబ్బాక): మండల పరిధిలోని తుక్కాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బర్రెంకల స్వామి తండ్రి పోచయ్య అనారోగ్యంతో బాధడుతున్న విషయం తెలుసుకున్న కాంగ్రెస్ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఇదే గ్రామంలో పలు కారణాలతో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

◆ **ఆలయ కమిటీ అధ్యక్షుడిగా బాలనర్సు**



బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని దాచారం సీతారామస్వామి ఆలయ పాలకవర్గాన్ని శనివారం గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దీటి బాలనర్సు, ఉపాధ్యక్షుడిగా గుండారం రాజయ్య, రెడ్డబోయిన చంద్రశేఖర్, కొలిపాక రాజు, గాజుల సంపత్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా వెంకయ్య, తిరుపతి, దామోదర్ తదితరులు ఎన్నికయ్యారు.

◆ **బహిరంగ వేలం**

హుస్నాబాద్: పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన దుకాణాల కిరాయి కోసం 8న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కిషన్‌రావు శనివారం తెలిపారు. ఒక్కో గది 100 చదరపు అడుగుల్లో నిర్మించిన ఆరు షాపులను దక్కించుకునేందుకు ఆసక్తిగల వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

◆ **చెక్కు అందజేత**

తొగుట(దుబ్బాక): మండల పరిధిలోని ఎల్లారెడ్డిపేటకు చెందిన బుర్ర వెంకట్ స్వామికి మంజూరైన రూ.60 వేల సీఎం సహాయనిధి చెక్కును శనివారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు కనికి స్వామి, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు రాంపురం రమేశ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బైతి స్వామి, బూత్ అధ్యక్షుడు యాదయ్య, యూత్ ప్రెసిడెంట్ చందు, సోషల్ మీడియా కన్వీనర్ ప్రవీణ్, సుమన్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

◆ **నేడు హోమియోపతి కన్వెన్షన్**

సిద్దిపేటకమాన్: కరీంనగర్‌లో ఆదివారం జరిగే రాష్ట్ర 5వ హోమియోపతి కన్వెన్షన్‌ను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు డాక్టర్ వల్లకోటి దేవేందర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి హోమియోపతి వైద్యులు హాజరవుతున్నారని, పలు అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో ఉన్న హోమియోపతి వైద్యులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

◆ **స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం**

సిద్దిపేటకమాన్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని బహుజన్ సమాజ్ పార్టీ నియోజకవర్గ నాయకులు అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో బీఎస్పీ పోటీ చేసి సత్తా చాటుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నామన్నారు. బీఎస్పీతోనే సామాజిక న్యాయం సాధ్యమని చెప్పారు. కార్యక్రమంలో మల్లేశ్, నరేశ్, హరికిరణ్, లింగం, ప్రసాద్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990